క్లుప్తంగా

1న లోక్ కల్యాణ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులందరికి పీఎం స్వానిధి పథకం ద్వారా రుణాలు అందించేందుకు అక్టోబర్ 1వ తేదీన పాపరాజుతోటలోని బాపనమ్మ కల్యాణ మండపంలో లోక్ కల్యాణ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ శనివారం తెలిపారు. పీఎం స్వానిధి పథకం ద్వారా చీరాల మున్సిపాలిటీలోని 5వేల మంది చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు రుణాలు అందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులందరూ మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో సంప్రదించి కేవైసీ డాక్యుమెంట్లుతో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, కౌన్సిలర్లు హాజరవుతారన్నారు.

390 మందికి వైద్య పరీక్షలు

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని తంగేడుమల్లి గ్రామంలో శనివారం స్వస్థ్ నారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా 390 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎన్‌సీడీ, పీఎంజేవై కార్డులు ఆన్‌లైన్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిర్మల్‌కుమార్, తంగేడుమల్లి సీహెచ్‌వో జయబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ నేడు

మార్టూరు: నియోజకవర్గ పరిధిలోని మార్టూరు మండలం డేగరమూడి గ్రామంలోని దళిత యువకులపై మార్టూరు సీఐ శేషగిరి చిత్రహింసలకు గురిచేసి బాధించిన ఘటనకు సంబంధించి బాధిత యువకులను పరామర్శించేందుకు రాష్ట్ర ఎస్సీ నాయకులు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామానికి రానున్నట్లు రాష్ట్ర విద్యార్థి విభాగం కన్వీనర్ మాచవరపు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాసుమల్లి వాసులు రానున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

వాత్సల్య రూపిణీ.. లలితా త్రిపురసుందరిదేవి


వేటపాలెం పర్వతవర్ధిని దేవిగా అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


సిండికేట్ వీవర్స్ కాలనీలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అద్దంకిలో గజలక్ష్మీదేవిగా వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు


నక్కబొక్కలపాడులో త్రిపురసుందరీ దేవిగా పోలేరమ్మ అమ్మవారు


జాగర్లమూడిలో లలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారు


నూతలపాడులో అమ్మవారిని అలంకరించిన భక్తులు


కారంచేడులో లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు

యద్దనపూడి: దసరా శరన్నవరాత్రుల్లో ఆరో రోజు అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో ఒకవైపు లక్ష్మీదేవి, మరో వైపు సరస్వతి దేవి వింజామరలు వీస్తూండగా చల్లని చిరునవ్వుతో భక్తులను అనుగ్రహించే ఆది దేవతగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. త్రిమూర్తుల కన్నా ఆది దేవతైన త్రిపురసుందరిదేవి అమ్మవారు పంచ దశాక్షరీ మహామంత్రానికి అధిదేవతగా, శ్రీచక్ర అధిష్టానదేవతగా, ఉన్న అమ్మవారిని కొలిచిన భక్తులకు సకల ఈతిబాధలు తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మండలంలోని జాగర్లమూడి ఉజ్జయినీ మహంకాళీ, పూనూరు త్రిపురసుందరిదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు, గన్నవరం కాశీ అన్నపూర్ణాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణలు, శ్రీచక్ర పూజలు నిర్వహించారు.

కారంచేడు: దేవీ సరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దసరా నవరాత్రులు పురస్కరించుకొని శనివారం ఆరో రోజున వేకువజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, గంగమ్మగుడి, వేణుగోపాల స్వామి గుడి, పెదబజారు శివాలయం, హరేరామ విశిష్ట ఆశ్రమం, వెంకటేశ్వరస్వామి వారి గుడి, సాయి మందిరం, కట్ట మల్లేశ్వరస్వామివారి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామివారి ఆలయం, గంగమ్మ గుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయం, తిమిడెదపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలోను అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

పర్చూరు(చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నిడమానూరి సురేష్, శిరీష దంపతులు పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒంగోలు గుర వారెడి పాలెం అవధూతేంద్ర భక్త భజన సమాజం నల్లమలుపు పున్నారెడ్డి ఆధ్వర్యంలో సంకీర్తనా కార్యక్రమం, ప్రకాశం శ్రీకళా వారిచే శ్రీకృష్ణ రాయబారం నాటకం పడక సీను, అనంతరం ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆదిపూడి మోహనకృష్ణ, వల్లభరెడ్డి శ్రీనివాసరెడ్డి, లింగంగుంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చినగంజాంలో మండలంలోని సోపిరాల గ్రామంలో లలితా పరమేశ్వరీ రామకోటేశ్వర స్వామి ఆలయం, రైల్వేస్టేషన్ సెంటర్‌లోని విజయ కనకదుర్గా ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి మందిరంలో శనివారం అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బల్లికురవ: నక్కబొక్కలపాడు, బల్లికురవ, కొత్తపాలెం, చిన అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాడు, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన గ్రామంలోని ఆలయాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో అమ్మవార్లను లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు రాత్రిళ్లు, భజనలు చేశారు.

చీరాల అర్బన్: దసరా శరన్నవరాత్రోత్సవాలను పట్టణంలోని పలు దేవాలయాలు, వార్డులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద ఘనంగా నిర్వహిస్తున్నారు. సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి సువర్ణకిరీటం అలంకరించారు. ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటి అధ్యక్షుడు గుంటూరు మాధవరావు తెలిపారు. పేరాలలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, జక్కావారివీధిలో, పాపరాజుతోటలోని కామాక్షి సోమేశ్వరస్వామి ఆలయం, పేరాలలోని శ్రీనివాసం అపార్టుమెంట్‌లో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలను నిర్వహించారు. ఈపూరుపాలెం సిండికేట్ వీవర్స్‌కాలనీలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

వైభవంగా నవరాత్రోత్సవాలు..

వేటపాలెం: స్థానిక కన్యకాపర మేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని పర్వతవర్ధిని దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రేమ త్యాగం సాంఘిక నాటక ప్రదర్శన ఆహూతులను అలరింపజేసింది.

జీఎస్టీ సేవింగ్స్ ఫలాలు ప్రజలకు అందించాలి

● జిల్లా పౌరసరఫరాల అధికారి జమీర్‌బాషా


మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి జమీర్‌బాషా

చీరాల అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సంస్కరణల అమలులో భాగంగా వ్యాపారులందరూ సహకరించి ప్రజలకు ఆ ఫలాలను అందించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్‌కె జమీర్‌బాషా అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 పై శనివారం చీరాలలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో వాణిజ్య పన్నుల శాఖ చీరాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ధరలు తగ్గించి వినియోగదారులకు వస్తువులు అందించాలన్నారు. తగ్గించిన వస్తువుల ధరల వివరాలను వినియోగదారులకు తెలిసే విధంగా బోర్డులను షాపుల ముందు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ డి.ఇమ్మానియేల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీఎస్టీపై సంస్కరించబడిన ఈ సమాచారాన్ని ప్రతి గడపకు చేర్చాలని, మరిన్ని వివరాలకు కేంద్ర వినియోగదారుల సమాచార కేంద్రం టోల్‌ఫ్రీ నెంబరు 1915, రాష్ట్ర వినియోగదారుల సమాచార కేంద్రం టోల్‌ఫ్రీ నెంబరు 1967 సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటి అసిస్టెంట్ కమిషనర్ డి.లక్ష్మీకుమార్, చీరాల జీఎస్టీ ఆఫీసర్ ఎస్‌కె జమీర్ అహ్మద్, సివిల్ సప్లయ్స్ డిటి ఓంకార్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలి


సమీక్ష సమావేశంలో వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఇంకొల్లు(చినగంజాం): రెవెన్యూ పరిధిలో పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలకు రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవా పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే తప్పులను సరిచేయించి ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితిలో పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. రీ సర్వే పనులు అన్ని పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

అంబడిపూడిలో కొలుపులకు అంకురార్పణ


కొలుపులకు ముస్తాబు చేసిన రేణుకలంకమ్మ తల్లి

బల్లికురవ: మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో పల్లపువారి రేణుక అంకమ్మతల్లి కొలుపులకు శనివారం అంకురార్పణ చేశారు. ఆలయంలోని శిలలను చీరాల సముద్రానికి తీసుకెళ్లి గ్రామంలో రాత్రికి గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం కొలుపుల ముగింపులో భాగంగా ఆలయం వద్ద పొంగళ్లు, అన్నసంతర్పన చేపట్టనున్నట్లు ఆలయ కమిటి తెలిపారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు.

ప్రతిభామూర్తులకు నివాళులు


ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అద్దంకి రూరల్: ఆర్టీసి రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభామూర్తులు మధురస్మృతులు, కార్యక్రమాన్ని స్థానిక బంగ్లా రోడ్‌లోని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతిభామూర్తులు గరికపాటి రాజారావు, దరిశి చెంచయ్య, హాస్య నటుడు సుత్తివేలు చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమానికి ఉబ్బా దేవపాలన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పీసీహెచ్‌కోటయ్య, అన్నమనేని వెంకటరావు, వారణాసి రఘురామశర్మ, నిమ్మరాజు నాగేశ్వరరావు, చప్పిడి వీరయ్య దివాకరదత్తు, కొల్లా భువనేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ ప్రవర్తన మార్చుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల అర్బన్: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు మాట్లాడుతూ బాలకృష్ణ అహంకార ప్రవర్తనను మార్చుకోవాలని, ప్రజలకు మేలు చేయని హామీల గురించి చర్చలు కాకుండా సభలో లేని వ్యక్తి గురించి అసభ్యకరంగా మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి పాలన కాస్త యుద్ధ పాలనగా మారి ఒకరిపై ఒకరు ఈర్షతో అహంకారమైన మాటలు మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ ఐ.బాబూరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు మల్లేష్‌రావు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు గోసాల అశోక్, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవరావు, రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, పార్టీ నాయకులు వాసిమళ్ల శ్రీను, షేక్ సుభాని, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాస్టర్, యువజన విభాగం నాయకులు కంచర్ల చక్రవర్తి, పోతురాజు, అన్నం సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల పోరుకు తరలిరండి

● నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అశోక్ కుమార్


డాక్టర్ అశోక్ కుమార్

అద్దంకి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలనే ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా ఈ నెల 30న బాపట్లలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పోరు నిర్వహించనున్నారు. ఈ పోరుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, కలిసి వచ్చే ప్రజా సంఘాలు తరలి రావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం, ప్రైవేటుకు కొమ్ము కాయడమేనన్నారు. కళాశాలల ప్రైవేటు చేయడం ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రైవేటు పరం చేయడం ప్రభుత్వం ఆపే వరకు పార్టీ ఆదేశాల మేరకు ప్రజల కోసం పోరాటాలు చేస్తామని శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సాహితీ భీష్ముడు జ్యోతిచంద్రమౌళి


చంద్రమౌళి దంపతులను సన్మానిస్తున్న రచయితలు

అద్దంకి: సాహితీ భీష్ముడు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి అని సాహితీవేత్త పుస్తక సమీక్షకుడు, రచయిత బీరం సుందరరావు అన్నారు. పట్టణంలోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జ్యోతి చంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం గ్రంథ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మద్రాసు తెలుగు యూనివర్శిటీ తెలుగు విభాగం డైరెక్టర్ విస్తాలి శంకరరావు, ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం ఒంగోలు అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డి, మరికొంత మంది సాహితీవేత్తలు హాజరయ్యారు. సందరరావు గ్రంథ సమీక్ష చేస్తూ చంద్రమౌళి తన చంద్రమౌళీయం గ్రంథం 175 పేజీలతో, ప్రముఖ కవులు తనను గురించి రాసిన పీఠికలు, వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాల సంకలనంగా తన వజ్రోత్సవ సంచికను 75వ యేట వెలువరించారని చెప్పారు. ఇప్పటికి ఆయన 28 గ్రంథాలు రచించారన్నారు. విస్తాలి శంకరరావు,వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొలిపే రచనలు, పీహెచ్‌డీ చేసేవారికి ఉపయోగపడే రచనలు చేసిన గొప్ప రచయిత అని చెప్పారు. వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు మాట్లాడుతూ చంద్రమౌళి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, తెనాలి వెంకట్రావు, డాక్టర్ ఫణీంద్రబాబు, తదితరులు ప్రసగించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేయగా, ధర్మరపు శ్రావణ్‌కుమార్ సభాహ్వానం పలికారు. తరువాత చంద్రమౌళి దంపతులను సాహితీవేత్తలు, ప్రముఖులు సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, గాడేపల్లి దివాకరదత్తు, చెన్నుపాటి రామరాంజనేయులు, అనలకమార సూరి, మన్నం త్రిమూర్తులు పాల్గొన్నారు.

భావన్నారాయణునికి వసంతోత్సవం

చినగంజాం: స్థానిక శ్రీభూ సమేత భావన్నారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీవారి విశేష పూజలు, విశేష హోమాలు, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం అనంతరం వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి అశ్వవాహనంపై అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం స్వామి వారికి చక్రస్నానం ఆచరింపజేసి అనంతరం భక్తులకు ఆచరించే అవకాశాన్ని కలిగించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి నిత్యహోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, గ్రామంలో మౌనబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను వేద పండితులు పరాశరం రామాచార్యులు, ఆలయ అర్చకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహించగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలివేటి శివనారాయణ, రామానుజం, విశ్వనాథ్‌బాబు, ఆలయ సేవాదళ కమిటీ సభ్యులు జీ పిచ్చయ్య, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.